వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 16 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



# స్పీకర్ కు డెడ్ లైన్!



## పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయం


- 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందే
- ఫిరాయింపులపై పార్లమెంట్ సమీక్షించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం తీర్పు



న్యూఢిల్లీ,--ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను అనుమతించిన సుప్రీం ధర్మాసనం.. వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అదే సమయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ గవాయ్ ఆదేశించారు.

-మిగతా 3 లో



### ఆ రెండు దేశాలవి
# డెడ్ ఎకానమీలు

- భారత్, రష్యాలపై నోరు పారేసుకున్న ట్రంప్

వాషింగ్టన్ -ప్రజా స్వేచ్ఛ

భారత్, రష్యా ఆర్థిక వ్యవస్థలు మృత ఆర్థిక వ్యవస్థలని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన సొంత సామాజిక మాధ్యమ సంస్థ అయిన 'ట్రూత్' వేదికగా ఈ మేరకు ఒక ప్రకటన పోస్టు చేశారు. 'రష్యాతో భారత్ ఏం చేసినా మాకు అనవసరం. ఆ రెండు దేశాలు కలిసి వాటి మృత ఆర్థిక వ్యవస్థలను ముందుకు తీసుకెళ్ళగలవు. అంతే' అని ఆయన పేర్కొన్నారు. 'భారత్‌తో మా వ్యాణిజ్యం చాలా తక్కువ. అయినా వారి టారిఫ్‌లు చాలా ఎక్కువ. ప్రపంచంలోనే అత్యధికం' అని ట్రంప్ తెలిపారు. తన మాటలను పట్టించుకోవాలంటూ

-మిగతా 3 లో

### ప్రజలకు చేరువయ్యేందుకే
# పాదయాత్ర

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పోరాడుతాం

- 6న ఢిల్లీలో ధర్నా
- మీ నమ్మకాన్ని కాపాడుకుంటాం.. అన్నీ హామీలు అమలు చేస్తాం
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- వికారాబాద్ జిల్లా పరిగిలో జనహిత పాదయాత్ర ప్రారంభం
- పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, సురేఖ



పరిగి,--ప్రజా స్వేచ్ఛ

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాడేందుకు ఈ నెల 6వ తేదీన ఢిల్లీలో ధర్నా చేపడుతామని, ఈ పోరాటంలో ప్రజలందరూ తమ వెంట ఉండాలని, ఎప్పుడైతే పోరాటం ప్రజా ఆందోళనగా మారుతుందో అప్పుడు విజయం సాధిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ప్రజలకు చేరువయ్యేందుకే తాము పాదయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. 'జై బాబు, జై భీమ్, జై సమ్మిదాన్' కార్యక్రమంలో 'జనహిత' పాదయాత్రను వికారాబాద్ జిల్లా పరిగి మండలం

-మిగతా 3 లో



# సర్కారుకు కాళేశ్వరం నివేదిక

- రెండు సీల్డ్ కవర్లల్లో ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జాకు చైర్మెన్ ఘోష్ అందజేత
- లాకర్‌లో భద్రపరిచిన అధికారులు
- సంచలన విషయాలు వెలుగులోకి ?

. హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. ఈమేరకు చైర్మెన్ పీసీ ఘోష్ గురువారం 650 పేజీలతో కూడిన తుది నివేదికను రెండు సీల్డ్ కవర్లల్లో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో అందజేశారు. రాహుల్‌బొజ్జా వెంటనే ప్రభుత్వ

-మిగతా 3 లో



# బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ

- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం తీర్పు
- కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ

మర్కుక్ -ప్రజా స్వేచ్ఛ

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో పార్టీ ముఖ్యనేతలు హరీశ్‌రావు, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి తో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఆయన ప్రధానంగా చర్చించినట్టు తెలు స్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో తుది తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత

-మిగతా 3 లో



# భారత ఆర్థిక వ్యవస్థ స్వరనాశనం

- కేంద్రంపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ --ప్రజా స్వేచ్ఛ

భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవ స్థితిలో ఉందని ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మినహా అందరికీ తెలుసునని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బిజెపి నాశనం చేసిందని ధ్వజమెత్తారు. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విమర్శ గురించి పార్లమెంట్ ఎదుట గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు.

-మిగతా 3 లో

# నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

- ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్



హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్ వీరితో ప్రమాణం చేయించారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్

-మిగతా 3 లో




### స్పీకర్ అనర్హత
# వేటు వేయాలి

- ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే రాహుల్ గాంధీ స్పందించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- స్పీకర్ అనర్హత వేటు వేయాలి

హైదరాబాద్ -ప్రజా స్వేచ్ఛ

సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని నిరూపించిన సుప్రీంకోర్టుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కోర్టులను తప్పుదోవ పట్టించాలన్న కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కొని అంతిమంగా సత్యమే గెలిచిందన్నారు. గౌరవప్రద స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకుని రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయింపుల రాజకీయానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ లాంటిదని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ తన నిజాయితీ, నిబద్ధతను నిరూపించుకోవాలని సూచించారు.

-మిగతా 3 లో



# రష్యాలో మరోసారి భారీ భూకంపం

- భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 6.5గా నమోదు

న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

రష్యా లో మరోసారి భారీ భూకంపం సంభవించింది. కురిల్ ఐలాండ్ లో గురువారం భూమి కంపించింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 6.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. నిన్న కమ్‌చట్కా ద్వీపకల్పంలో ( భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే.


-మిగతా 3 లో

-మిగతా

# ధర్మస్థల మిస్టరీపై ముమ్మరంగా దర్యాప్తు..

## తవ్వకాల్లో బయటపడ్డ ఎముకలు

**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల' లో అనుమానాస్పద మరణాలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సిట్ చీఫ్ ప్రణబ్ మొహంతి డీఐజీ ఎంఎన్ అనుచేత్ ఆధ్వర్యంలో ధర్మస్థల మిస్టరీపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసు దర్యాప్తులో గురువారం కీలక ముందడుగు పడింది. పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ఆరో స్థలం తవ్వకాలు జరుపగా ఎముకలు బయటపడ్డాయి.కర్ణాటక రాష్ట్రం శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో తానే స్వయంగా కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పుడు అక్కడ పనిచేసిన పారిశుద్ధ్య కార్మికుడు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసి సంచలనం రేపాడు. పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఆ అనుమానాస్పద మరణాలపై కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సిట్ చీఫ్‌గా ప్రణబ్ మొహంతిని నియమించింది. మొహంతి నేతృత్వంలోని సిట్ బృందం ఇప్పుడు ముమ్మరంగా కేసు దర్యాప్తు చేస్తోంది.సిట్ బృందానికి పారిశుద్ధ్య కార్మికుడు మొత్తం 14 ప్రదేశాలను చూపించాడు. ఆ 14 ప్రదేశాల్లో తవ్వకాల కోసం సిట్ 20 మంది కూలీలను నియమించుకుని తవ్వకాలు సాగిస్తోంది. గత సోమవారం నుంచి సిట్ దర్యాప్తు మొదలైంది. ఇప్పటికే



ఐదు ప్రదేశాల్లో తవ్వకాలు పూర్తయ్యాయి. తొలి ప్రదేశంలో గత వారం తవ్వకాలు జరుపగా ఒక చీటి, ఒక పర్సు లభ్యమయ్యాయి. వాటిని పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆ తర్వాత నాలుగు ప్రదేశాల్లో తవ్వకాలు జరుపగా ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు.ఈ క్రమంలో పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ఆరో ప్రదేశంలో ఇవాళ సిట్ అధికారులు తవ్వకాలు జరిపించారు. ఈ తవ్వకాల్లో పెద్ద సంఖ్యలో ఎముకలు దొరికాయి. అనుమానాస్పద మరణాలకు సంబంధించి ఇప్పటివరకు సిట్ అధికారులకు దొరికిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. మరో ఎనిమిది ప్రదేశాల్లో కూడా సిట్ అధికారులు తవ్వకాలు జరపనున్నారు. మరిన్ని ఆధారాలు దొరికే అవకాశం ఉంది. తాను చూపించిన 14 ప్రదేశాలకుగాను 9 నుంచి 13 ప్రదేశాల్లో మానవ అవశేషాలు లభించే అవకాశం ఉందని పారిశు ద్ధ్య కార్మికుడు చెబుతున్నాడు.నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలివైపు ఉన్న ప్రాంతం నుంచి అధికారులు పరిశోధన ప్రారంభించారు. కాగా ధర్మస్థల దక్షిణ కన్నడ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి భారీగా భక్తులు వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి మానేసిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. సంచలన విషయాలు బయటపెట్టాడు. 1998 నుంచి 2014 మధ్య అక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని, వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు చెప్పాడు.అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారి మృతదేహాలని, వారు లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నాయని అతడు తెలిపాడు. అతడి మాటలు కర్ణాటక రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. కాగా 2014 డిసెంబర్‌లో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండటంతో తాము ఆనాడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ పారిశుద్ధ్య కార్మికుడు తెలిపాడు. ఈ క్రమంలో మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు..? ఎవరి సాయంతో వాటిని తీసుకువెళ్లేవారు..? తదితర వివరాలను అధికారులు ఆ కార్మికుడి నుంచి అడిగి తెలుసుకుంటున్నారు.


## ఆగస్టు 4 నుంచి భారత్‌లో ఫిలిప్పైన్స్ అధ్యక్షుడి పర్యటన



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్ ఆగస్టు 4 నుంచి భారత్ లో పర్యటించనున్నారు. ఆగస్టు 4 నుంచి 8 వరకు పర్యటన కొనసాగనుంది. ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు ఆయన భారత్‌కు వస్తున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు మార్కోస్‌తోపాటు ఆయన సతీమణి మడామే లూయిస్ ఆరనేటా మార్కోస్ కూడా భారత్‌కు రానున్నారు. వారితోపాటు పలువురు క్యాబినెట్ మంత్రులు, ఉన్నతాధికారులు, వ్యాపార ప్రతినిధులతో కూడిన ఉన్నతస్థాయి బృందం కూడా వారితోపాటు భారత్‌కు రానుంది. ఆగస్టు 8న బెంగళూరులో పర్యటించి ఫిలిప్పైన్స్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.కాగా మార్కోస్ ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు అయిన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా మార్కోస్ ఆగస్టు 5న ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యి పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌లతో కూడా మార్కోస్ భేటీ కానున్నారు. కాగా భారత్, ఫిలిప్పైన్స్ మధ్య 1949 నవంబర్ నుంచి దౌత్య సంబంధాలు మొదలయ్యాయి.అప్పటి నుంచి రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సముద్ర సహకార, వ్యవసాయ, ఆరోగ్య, ఫార్మా, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పరస్పర సంబంధాలు బలపడుతూ వస్తున్నాయి.

## పాక్‌కు గట్టి షాక్ ఇవ్వబోతున్న భారత్..!

### చీనాబ్ నదిపై జల విద్యుత్ ప్రాజెక్టు..!



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
పాక్‌కు భారత్ గట్టి షాక్ ఇవ్వబోతున్నది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టును తిరిగి చేపట్టబోతున్నది. దాంతో పాకిస్తాన్‌కు భారత్ అడ్డుకట్ట వేయనుంది. పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత నెలకొన్న పరిణామాల నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత భారత్ జమ్ముకశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ఈ భారీ విద్యుత్ ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతున్నది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది.ఇదివరకే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980 సంవత్సరం నుంచే ఉన్నది. పాక్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు నాలుగు దశాబ్దాలుగా నిలిచిపోయింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం సింధూ జలాల ఒప్పందం అమలును ఇటీవల నిలిపివేసిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు కేంద్రం ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 1,856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22వేల కోట్లు అవుతుందని అంచనా. దాదాపు రెండు దశల్లో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు కోసం అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు కేంద్రం చర్యలు తీసుకున్నది. చివరగా పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైందని సమాచారం.

## ఇంటర్నెట్ సేవలకు స్టార్‌లింక్‌కు గ్రీన్ సిగ్నల్




**న్యూఢిల్లీ -**
ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ భారతదేశంలో ఉపగ్రహ సేవల ఆధారిత ఇంటర్నెట్‌ను ప్రారంభించడానికి లైసెన్స్ పొందింది. స్పెక్ట్రమ్ కేటాయింపు సజావుగా అమలు చేయడానికి ఒక ఫ్రేమ్‌వర్క్ కూడా అమలులో ఉందని కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గురువారం తెలిపారు. 1995లో దేశంలో మొట్టమొదటి సెల్యులార్ కాల్ చేసిన 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ప్రకటన జరిగింది.

## ఉగ్రవాదం ఎన్నడూ కాషాయం కాలేదు, కాదు, కాబోదు

దేవేంద్ర ఫడ్నవీస్



**ముంబై -ప్రజా స్వేచ్ఛ**
ఉగ్రవాదం గతంలో ఎన్నడూ కాషాయం రంగు పులుముకోలేదని, పులుముకోదని, భవిష్యత్తులో కూడా పులుముకోబోదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు. మాలేగావ్ బ్లాస్ట్ కేసు లో ఏడుగురు నిందితులను ఇవాళ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించడంపై ఆయన స్పందించారు.మాలేగావ్ బ్లాస్ట్ కేసులో బీజేపీ మాజీ ఎంపీ ప్రగ్యా సింగ్ ఠాకూర్ సహా ఏడుగురు నిందితులను ఎన్ఐఏ స్పెషల్ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఆ పేలుడు ఘటనతో వారికి సంబంధం ఉన్నట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు వ్యాఖ్యానించింది. కాగా 2008 సెప్టెంబర్ 29న ముంబైకి 200 కిలోమీటర్ల దూరంలోని మాలేగావ్‌లోని మసీదు దగ్గర టూవీలర్‌కు అమర్చిన బాంబు పేలి ఆరుగురు మృతిచెందారు. మరో 101 మంది గాయపడ్డారు. దాదాపు 17 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో తీర్పు వెలువడింది.

## వాతావరణ సమాచారం అందించనున్న 'నిసార్'

**మొదటిసారిగా నాసా-ఇస్రో సంయుక్తంగా రాకెట్ ప్రయోగం**
**ఈ ఏడాది ఆఖరు నాటికి గగనయాన్-1**
**ఇస్రో చైర్మన్ వి నారాయణన్**

**సూళ్లూరుపేట-ప్రజా స్వేచ్ఛ**
నిసార్ ఉపగ్రహం పూర్తిగా వాతావరణ సమాచారం కోసం చేస్తున్న ప్రయోగం. 2,392 కిలోల బరువు కలిగిన ఈ ఉపగ్రహం ప్రతి 12 రోజులకు ఒకసారి భూమిని చుడుతూ పరిశీలించిన సమాచారాన్ని ఇస్రో కేంద్రానికి స్పష్టమైన త్రీడీ చిత్రాలను అందించనుంది. ప్రకృతి విపత్తులను ముందుగానే తెలియజేస్తుంది. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు, సునామి వంటి విపత్కర ప్రమాదాల సమాచారాన్ని ముందుగానే అందిస్తుంది. మంచు పర్వతాల కదలికలు, కొండల చర్యలు, కదలకలను నిసార్



ఉపగ్రహం ద్వారా గుర్తించవచ్చు. ఇది నిఘా ఉపగ్రహంగా కూడా ఉపయోగపడుతుంది. ఈ ఉపగ్రహం ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ మాట్లాడుతూ ఇస్రో-నాసా బంధం బలపడి రాబోయే కాలంలో మరో మూడు ప్రయోగాలను సంయుక్తంగా నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నామని, నిసార్ ఉపగ్రహంలోని సాంకేతిక పరికరాలను సంయుక్తంగా రూపొందించామని తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు జరుగుతాయని, చంద్రయాన్-4 ప్రయోగ పనులకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి గగనయాన్-1 పేరుతో ప్రయోగం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పిఎస్ఎల్వి సిరీస్‌లో కూడా మరో నాలుగు ప్రయోగాలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

**గ్యాలరీలో పదివేల మంది వీక్షకులు..**
గతంలో ఎప్పుడూ లేనివిధంగా శ్రీహరికోట గ్యాలరీలో దాదాపు పది వేల మంది విద్యార్థులు ఈ ప్రయోగాన్ని వీక్షించారు. ప్రయోగం అనంతరం హర్షధ్వానాలతో శ్రీహరికోట మార్మోగింది. ప్రయోగం విజయవంతం కావడంతో నాసా శాస్త్రవేత్తలు, ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు

## తమిళనాడులో ఎన్డీయే కూటమికి బిగ్ షాక్..!


**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముందు అన్యూహ్య పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే మాజీ నేత, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీఏ కూటమికి గుడ్‌బై చెప్పారు. గురువారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పన్నీర్ సెల్వం మార్నింగ్ వాక్ చేశారు. కొన్ని గంటల గ్యాప్‌లోనే ఎన్డీఏ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు.వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే గురువారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ తన దినచర్యలో భాగంగా మార్నింగ్ వాక్‌కు వెళ్లిన సమయంలో పన్నీర్ సెల్వం కలిశారు. కొద్దిసేపు మాట్లాడుకున్నారు. అనంతరం కొన్ని గంటల తర్వాత ఎన్డీఏ నుంచి వైదొలుగుతున్నట్లు పన్నీర్ సెల్వం ప్రకటించారు. ఈ విషయాన్ని పెన్నీర్ సెల్వం విశ్వాసపాత్రుడు పన్రుతి ఎస్. రామచంద్రన్ తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏతో పొత్తును ముగించుకుంటున్నట్లు వెల్లడించారు. ఓపీఎస్ త్వరలో రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభిస్తారని.. ప్రస్తుతం ఏ పార్టీతోనూ పొత్తు లేదన్నారు. భవిష్యత్తులో ఎన్నికలకు మందు పొత్తుపై ఆలోచిస్తామన్నారు.

## కాపర్ ఉత్తత్తులపై 50శాతం టారిఫ్

**వాషింగ్టన్ -ప్రజా స్వేచ్ఛ**
అమెరికా అధ్యక్షులు ట్రంప్ మరింత దూకుడుగా టారిఫ్‌లను విధిస్తున్నారు. కాపర్ దిగుమతులపై 50శాతం టారిఫ్‌లను విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్ట్ 1 నుండి సెమీ -ఫినిష్డ్ కాపర్, కాపర్ ఆధారిత ఉత్పత్తుల దిగుమతులపై 50శాతం టారిఫ్‌లను విధిస్తున్నట్లు బుధవారం విడుదలైన వైట్ హౌస్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పేర్కొంది. అమెరికా జాతీయ భద్రతకు ముప్పు కలిగించే పరిస్థితుల్లో, పరిమాణంలో కాపర్‌ను దిగుమతి చేసుకుంటున్నట్లు ఈ ప్రకటన



తెలిపింది. భారత్ 2025 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు 360 మిలియన్ డాలర్ల విలువైన రాగి ఉత్తత్తులను ఎగుమతి చేసింది. వాటిలో ప్లేట్లు, ట్యూబ్‌లు మరియు ఇతర సెమీ -ఫినిష్డ్ నమూనాలు ఉన్నాయి. ట్రంప్ టారిఫ్‌లతో ఈ ఎగుమతులు ఇప్పుడు మరింత ఖరీదైనవిగా మారనున్నాయి. జపాన్ మరియు యూరోపియన్ యూనియన్ వంటి మిత్రదేశాలతో సహా అన్ని దేశాలకు టారిఫ్ ఒకే విధంగా వర్తిస్తోందని .. ఇది సరఫరా దేశాల్లో సమాన స్థాయిని సృష్టిస్తుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) పేర్కొంది. ఇతర దేశాలతో పోలిస్తే.. భారత్ దేశ కాపర్ వాణిజ్యంపై ప్రభావం పరిమితంగా ఉంటుందని జిటిఆర్ఐ వ్యవస్థాపకుడు అజరు శ్రీవాస్తవ పేర్కొన్నారు..

## బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ

(మొదటి తరువాయి)



సంతరించుకుంది. అంతేకాక, గురువారం నాటితో పి.జస్టిస్ చంద్రఘోష్ కాళేశ్వరం కమిషన్ గడువు ముగిసి.. ప్రభుత్వానికి రిపోర్టు అందించ డంతో వారి సమావేశంలో దీనిపై కూడా చర్చ జరిగినట్టు సమాచారం. మేడిగడ్డతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో లోపాలకు తామే కారణమని కాళేశ్వరం కమిషన్ నివేదిక ఇస్తే.. ప్రభు త్వంపై ఎలా కౌంటర్ అటాక్ చేయాలనే దానిపై సమాలో చనలు చేసినట్టు తెలు స్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ సన్నద్ధత, అభ్యర్థి ఎంపికపై హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, కేటీఆర్ తమ అభిప్రాయాలను కేసీఆర్‌తో పంచుకున్నట్టు తెలుస్తోంది. చివరగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ శ్రేణులను యాక్టివ్ చేయడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కూడా చర్చించినట్టు సమాచారం.

## భారత ఆర్థిక వ్యవస్థ స్వరనాశనం

(మొదటి తరువాయి)



అవును, ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈవిషయం తెలుసునని అన్నారు. ట్రంప్ వాస్తవాన్ని వెల్లడించినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. ఇందులో ఆశ్చర్యం లేదని, అదానీకి సహాయం అందించడం కోసం బిజెపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందని, ఆవిషయాన్ని ట్రంప్ స్పష్టం చేస్తారని, ట్రంప్ చెప్పినట్లు ప్రధాని మోడీ చేస్తారని అన్నారు. భారతదేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు- ప్రకటించిన తర్వాత, భారత్,రష్యాల ఆర్థిక వ్యవస్థలు నిర్జీవమైనవని అమెరికా అధ్యక్షులు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

(మొదటి తరువాయి)



సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఈనెల 28న ఆమోదముద్రవేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది. మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి.

## రష్యాలో మరోసారి భారీ భూకంపం

(మొదటి తరువాయి)

అదే ప్రాంతానికి 200 మైళ్ల దూరంలో తాజాగా ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస భూకంపాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అయితే, తాజా భూకంపం కారణంగా ఎలాంటి సనామీ హెచ్చరికలూ జారీ కాలేదు. రష్యాలోని కమ్‌చట్కా ద్వీపకల్పం లో బుధవారం ఉదయం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే 4.4 అంతకంటే ఎక్కువ తీవ్రతతో 125 సార్లు భూమి కంపించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. వాటిలో మూడు 6.0 తీవ్రతకంటే ఎక్కువగా నమోదైనట్లు పేర్కొంది. రష్యాలో ఇంత తీవ్రతతో భూకంపం రావడం ఇదే మొదటిసారి. భూకంపం కారణంగా వచ్చిన సునామీ ప్రభావంతో కామ్‌చట్కా ఉపఖండంలోని నౌకాశ్రయాలతోపాటు జపాన్ తీరం, అమెరికాలోని హవాయి రాష్ట్ర తీరప్రాంతాలు సముద్రపు నీటిలో మునిగిపోయాయి. మూడు మీటర్ల కన్నా ఎత్తయిన అలలు వరుసగా దాడి చేశాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తీర ప్రాంత ప్రజలు ఎత్తయిన ప్రదేశాలవైపు పరుగులు తీయడంతో అనేక దేశాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. భూకంపం, సునామీ కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్టు ఎటువంటి సమాచారం వెలువడలేదు.

# స్పీకర్ కు డెడ్ లైన్!

(మొదటి తరువాయి)

కాగా, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసుపై సుప్రీంకోర్టులో సుధీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై సుప్రీంకోర్టులో సుధీర్ఘ వాదనలు నడిచాయి. ఈ వాదనల అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. బిఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోపు నిర్ణయించాలని సూచించింది. ఏ ఎమ్మెల్యే అయినా.. స్పీకర్ పక్రియను పొడిగించాలని అడగకూడదు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చు. రాజకీయ ఫిరాయింపులు జాతీయ చర్చనీయాంశంగా మారింది. దాన్ని అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని వ్యాఖ్యానించారు. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంటులో చేసిన వివిధ ప్రసంగాలను కూడా పరిశీలించాం. రాజేష్ పైలట్.. దేవేంద్ర నాథ్ మున్షి లాగా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడంలో డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ 2014 నవంబర్ 22న తీర్పును పక్కన పెడుతున్నాము. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు సంవత్సరాల తరబడి సాగడం అర్థరహితంగా అని పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే స్పీకర్ ఎమ్మెల్యేలకు నోటీసు జారీ చేయడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించింది. అపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది.ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం తీర్పు వెలువడింది. దీనిని బిఆర్ఎస్ నేతలు స్వాగతించాలి.

# సర్కారుకు కాళేశ్వరం నివేదిక

(మొదటి తరువాయి)

ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావుకు ఇచ్చారు. ఈ నివేదికను సీఎస్ కార్యాలయంలోని లాకర్‌లో భద్రపరిచినట్టు తెలిసింది. ఇదిలావుండగా గత బీఆర్ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల్లో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ కోసం 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగతా బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు తలెత్తడంపై విజిలెన్స్ విచారణతోపాటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్టు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయవిచారణ చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వెంటనే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి అయిన పీసీ ఘోష్‌ను నియమించారు. ఆయన 2019 నుంచి 2022 వరకు భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా పనిచేసిన విషయం విదితమే. గత 2024, మార్చి 14న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ దాదాపు 15 నెలలపాటు 115 మందిని విచారించింది. ఈ బ్యారేజీలకు సంబంధించిన డీపీఆర్, డిజైన్లను పరిశీలించిన కమిషన్, విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులను విచారించింది. ఇందులో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కూడా కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ చేసింది. అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు ఇలా మొత్తం 115 మందిని విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. అఫిడవిట్లు, వాంగ్మూలాలను విశ్లేషించి తుది నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి కమిషన్ సమర్పించింది. కాళేశ్వరం నివేదిక ప్రభుత్వానికి చేరడంతో అందులో ఏముందనే విషయమై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. ఈ నివేదిక నేపథ్యంలో రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ప్రజలకు చేరువయ్యేందుకే పాదయాత్ర

(మొదటి తరువాయి)

రాఘవపూర్‌లో గురువారం ఆమె ప్రారంభించారు. ఈ పాదయాత్రలో టీపీసీసీ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. రాఘవపూర్ నుంచి పరిగి వరకు ఈ పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మీనాక్షి నటరాజన్ మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో ప్రేమతో, కష్టపడి పాదయాత్రకు వచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాదయాత్ర అనే ఆచారం చాలా పురాతనమైనదని, దేశంలోని మసీదులు, దేవాలయాలు వంటి పవిత్ర స్థలాలకు వెళ్ళినప్పుడు నడుచుకుంటూ వెళ్తామని అన్నారు. 3,500 కిలోమీటర్ల పాదయాత్ర చేసి రాహుల్ గాంధీ తమకు కొత్త దారి చూపించారని తెలిపారు. ఆయన చూపించిన దారిలో తామూ నడుచుకుంటూ ప్రజల మధ్యకు వచ్చామని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఎప్పుడు మాట్లాడిన తెలంగాణను మోడల్‌గా చెప్తారని తెలిపారు. రాబోయే రోజుల్లో పేదలను అభివృద్ధి చేసే విధంగా ముందుకు కొనసాగుతామని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి గ్రామస్థాయిలో కూడా పార్టీ అధికారంలో ఉంటే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పాదయాత్ర అనేది కాంగ్రెస్ పార్టీలో నరానరాల జీర్ణించుకుపోయిన అంశమని అన్నారు. పాదయాత్ర ద్వారానే దేశాన్ని చూడగలిగామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో ఉద్యమాలు, ఎన్నో యాత్రలు చేశారని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలు ఇచ్చినందుకు ప్రజలు పార్టీని నమ్మారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పదేండ్ల కాలంలో ఏడున్నర లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని ఆరోపించారు. బీజేపీ మెడలు వంచి బీసీ రిజర్వేషన్స్ తెచ్చుకునే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. నిజాం ప్రభువు వదిలేసిన లక్షల కోట్ల భూములను కేసీఆర్ ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని విమర్శించారు. ఈ యాత్ర నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

## స్పీకర్ అనర్హత వేటు వేయాలి

(మొదటి తరువాయి)



పార్టీ మారితే అనర్హత వర్తించాలని పాంచ్ న్యారు సూత్రాన్ని వల్లె వేస్తున్న రాహుల్ సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతించాలన్నారు. పార్టీ ఫిరాయింపులపై రాష్ట్రానికో నీతి సూత్రం కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలకు సరికాదనీ, ఆ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సుప్రీం తీర్పుతో రానున్న మూడు నెలల్లో 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని భావిస్తున్నామని చెప్పారు. ఉప ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

## ఆ రెండు దేశాలవి డెడ్ ఎకామీలు

(మొదటి తరువాయి)

రష్యా మాజీ అధ్యక్షులు దిమిత్రి మెద్వదెవ్‌ను కూడా ఆయన హెచ్చరించారు. మెద్వదెవ్ చాలా ప్రమాదకరమైన ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. గత జులై 28న మెద్వెదెవ్ పెట్టిన పోస్టుకు వ్యంగ్యంగా ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. '50 రోజులా లేదా పది రోజులా అంటూ ..ట్రంప్, రష్యాతో ఆటలాడుతున్నారు. ఆయన రెండు విషయాలు గుర్తించుకోవాలి. ఒకటి రష్యా ఇజ్రాయిల్ కాదు..ఇరాన్ కూడా కాదు. .ప్రతి కొత్త అల్టిమేటమ్ కూడా ఒక బెదిరింపే, యుద్ధం దిశగా ఒక అడుగే, అదీ రష్యా, ఉక్రెయిన్ మధ్య కాదు, ఆయన సొంత దేశంతో, అలాంటి పనికి దిగొద్దు' అంటూ మెద్వెదెవ్ నాటి పోస్టులో ట్రంప్‌ను హెచ్చరించారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. దేశ ఆర్థిక వ్యవస్థ కునారిల్లిపోతున్న సంగతి ప్రపంచమంతటికీ తెలుసు కానీ..బిజెపి నేతలకు ముఖ్యంగా ప్రధాని మోడీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మాత్రం తెలియడం లేదని ప్రతిపక్షాల నేతలు విమర్శలు గుప్పించారు. ఇప్పటికైనా కనువిప్పు కలిగి అదానీ, అంబానీలకు సహజ సంపదను, ప్రభుత్వ రంగాలను దోచిపెట్టే విధానాలకు స్వస్తి పలికి యువతకు ఉపాధి కల్పించడంపైనా, గ్రామీణ ప్రజలను ఆదుకోవడం పైనా దృష్టి సారించాలని హితవు పలికారు.


## సంపాదకీయం

# కట్టని కాళేశ్వరమే బనకచర్ల

జీవధార జగడాలు జటిలమైనవి. నీటి పంపకాలలో పక్షపాతాలు ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా విభజించాయి. వేరుపడిన దశాబ్దం అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి -బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు (లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్) ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల ఘర్షణలు పునఃప్రారంభమయ్యే పరిస్థితిని కల్పించింది. రైతులు సమృద్ధ సాగునీటి వసతిని కోరుతున్నారు. వారి ఆరాటం రాజకీయవేత్తలకు మరొక మెగా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆరంభించేందుకు ఆలంబన అయింది. బనకచర్ల ప్రాజెక్టు ఏమిటి? అది ఆంధ్రప్రదేశ్ కాళేశ్వరం! తెలంగాణలో కట్టిన కాళేశ్వరం, ఆంధ్రలో ప్రతిపాదిత బనకచర్ల మధ్య పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. తొమ్మిది దశలవారీగా నీటి పంపింగ్, ఇంచుమించు 400 కిలోమీటర్ల దూరానికి బదలాయింపు, కాలువలు, సొరంగాలు, 150 టీఎంసీలకు పైగా నీటి నిల్వ చేసే భారీ జలాశయాలు. రెండిటి నిర్మాణ వ్యయ అంచనా కూడా సమస్థాయిలో ఉన్నది. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే ప్రాజెక్టులివి. భారీ ప్రాజెక్టులు, వాటిని మించిన మహా భారీ ప్రాజెక్టులు నిర్మించడమనే ప్రక్రియ అప్రతిహతంగా సాగిపోతోంది. నిర్మాణ వ్యయాలు పోటా పోటీగా పెరిగిపోతున్నాయి. ఈ పోటీ సుడిలో బనకచర్ల లాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చిక్కుకున్నాయి. వ్యవస్థాపిత ప్రమాణాలు, ఆర్థిక తర్కాన్ని ఈ ప్రాజెక్టులు పరిగణనలోకి తీసుకోవు. పర్యావరణ వ్యవస్థల పరిరక్షణను పట్టించుకోవు. పుట్టని తరాల వారిపై పడుతున్న భారం గురించి కించిత్ ఆలోచన కూడా ఉండదు. ఈ పరిణామాలు మినహాయింపుగా కాకుండా ఒక సాధారణ ప్రమాణంగా వాటిల్లుతున్నాయి. ప్రాజెక్టు పరిమాణం ఎంత భారీగా ఉంటే అంత మంచిది, నిర్మాణ వ్యయం ఎంత అధికంగా ఉంటే అంత ప్రయోజనకరం. కాళేశ్వరం, బనకచర్ల కథ ఒకటే. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికాలో సైనిక- పారిశ్రామిక వర్గాల కుమ్మక్కుతో ఆయుధోత్పత్తి పరిశ్రమలు విస్తరిల్లినట్టుగా ఇప్పుడు మన దేశంలో రాజకీయ వర్గాలు- బిల్డర్లు, ఇంజనీరింగ్ సంస్థల కుమ్మక్కుతో మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్టుల నిర్మాణం పెచ్చరిల్లిపోతోంది. సమస్త వ్యవస్థాపిత ప్రమాణాలు, నియమ నిబంధనలు, నదీ జల పంపకాల ఒప్పందాలు, వ్యయ ప్రయోజన తర్కాన్ని భూస్థాపితం చేసేందుకు ఆంధ్ర, తెలంగాణ, గోదావరి ఎగువ రాష్ట్రాలు, భారత ప్రభుత్వం, కేంద్ర జల సంఘం ఏకీభవిస్తేనే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం సుసాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు ఎప్పటికైనా ఒక రూపు తీసుకుంటే, అంతర్ రాష్ట్ర ఒప్పందాలను లక్ష్య పెట్టకుండా తమకు తోచిన రీతిలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టేందుకు అన్ని రాష్ట్రాలనూ పురిగొల్పుతుంది. రాయలసీమ రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు బనకచర్ల నిర్మించాల్సిన అవసరం లేదు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యి, నీటి సరఫరా మొదలైనా నిర్వహణ వ్యయం పంట దిగుబడుల విలువ కంటే అధికంగా ఉంటుందని చెప్పేందుకు పెద్ద తెలివితేటలు అవసరం లేదు. నీటి సరఫరా వ్యయం ఎకరానికి రూ.50వేలకు మించి ఉంటుందని ఇప్పటికే కొంతమంది లెక్క కట్టారు. బనకచర్ల నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించినా అది ఆంధ్రా ప్రజలకు పెద్ద భారమవుతుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 200 టీఎంసీల నీరు అందుబాటులో లేదుబీ సముద్రానికి తరలిపోయే నీరు ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాతిపదిక కాదుబీ సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితులలోను అనుమతినివ్వబోదుబీ సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టలేదుబీ అనుమతి లేకుండానే నిర్మాణాన్ని ఆరంభించిన పక్షంలో ఎగువ రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. సముద్రం లోకి వృథాగా పోతున్నాయని చెబుతున్న 3000 టీఎంసీల నీటిలో ఎగువ రాష్ట్రాలు వివిధ కారణాల వల్ల ఉపయోగించుకోని జలాలు కూడా ఉన్నాయనేది విస్మరించకూడదు. వరద జలాలు అన్న భావనే లేదు. నదుల్లో ప్రవహించే నీటిని అడ్డుకోవడం, ఉపయోగించుకోవడం కుదరదు. ఈ కారణంగానే సీడబ్ల్యూసీ ఆయా నదుల్లో లభ్యమయ్యే నీటికి సంబంధించి అంచనాలు వేసి, పరీవాహక ప్రాంత రాష్ట్రాలకు కేటాయింపులు జరుపుతోంది. బనకచర్ల ప్రస్తుత అంచనా వ్యయం రూ.80,000 కోట్లు. అంతిమంగా ఇది రూ.1,50,000 కోట్లకు పెరగవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ మొత్తాన్ని మరింత అర్థవంతంగా, మరింత ప్రయోజనకరమైన ప్రాజెక్టులకు వినియోగించాలి. తెలంగాణ రాష్ట్రం తప్పకుండా బనకచర్లను వ్యతిరేకిస్తుంది. అయితే అది తమ న్యాయబద్ధమైన వ్యతిరేకతలను సీడబ్ల్యూసీ అధికార పరిధిలో వ్యక్తం చేయాలి. ప్రజల వద్దకు ఈ సమస్యను తీసుకుపోయి భావావేశాలను రెచ్చగొట్టడం మంచిది కాదు. బనకచర్లపై వ్యతిరేకత వ్యక్తం చేసేందుకు వ్యవస్థాపిత ప్రమాణాలు, వేదికలు ఉన్నాయి. ఈ సమస్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల మధ్య కాదు. తెలంగాణ రాష్ట్రం గోదావరి నదీజలాల ట్రిబ్యునల్ తమకు కేటాయించిన నీటిలో సగభాగాన్ని కూడా ఉపయోగించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ తన వాటాను ఇప్పటికే పూర్తిగా వినియోగించుకుంటోంది. బనకచర్లపై ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికకు సంబంధించి సీడబ్ల్యూసీ తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలో సూచించిన విధంగా ఆంధ్రకు అదనపు జలాలు సమకూరుస్తామని తెలంగాణ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడమనేది జరగని విషయం. తనకు కేటాయించిన నీటి వాటా, భావి ప్రాజెక్టులపై తన హక్కును వదులుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరిస్తే తప్ప, దాని నుంచి ఆంధ్రప్రదేశ్ 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు తమకు అభ్యంతరం లేదనే లిఖితపూర్వక హామీ పొందడమనేది జరగదు. సీడబ్ల్యూసీ బాధ్యతలు, అధికారాలు రాజ్యాంగ నిర్దేశితమైనవి. తమకు కేటాయించిన నదీజలాల ఆధారంగా కాకుండా ఇతరత్రా నిర్మించేందుకు తలపెట్టిన కొత్త ప్రాజెక్టులకు అనుమతిని నిర్ద్వంద్వంగా నిరాకరించేందుకు సీడబ్ల్యూసీకి అధికారమున్నది. నీటి కేటాయింపులు పొంది, ప్రస్తుతం ఆ జలాలను ఉపయోగించుకోలేకపోతున్న రాష్ట్రాల భావి ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యత కూడా సీడబ్ల్యూసీపై ఉన్నది. ఎగువ రాష్ట్రాలు ఏవైనా తమ వాటా నీటిని ఉపయోగించుకోలేకపోతే దిగువ రాష్ట్రాలు వాటిని ఉపయోగించుకునేందుకు వీలులేదు. ఉమ్మడి పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాల అవసరాలు, ఆకాంక్షలను తప్పక గుర్తించి, గౌరవించాలి. ఈ దృష్ట్యా వరద జలాలు, సముద్రానికి వృథాగా వెళుతున్న నీరు అనే భావనలు బనకచర్ల తరహా అదనపు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆలంబన కాబోవు. సముద్రంలోకి ప్రవహిస్తున్న నీరు వృథా అయిపోతుందనేది పూర్తిగా కాలం చెల్లిన భావన. నదీ ప్రవాహాలను అడ్డుకుంటే పర్యావరణ విపత్తులు సంభవిస్తాయి. నదులు స్వేచ్ఛగా సముద్రానికి ప్రవహించాలి..

# అన్ని చర్యలు తీసుకుంటాం..

## ట్రంప్ టారిఫ్‌పై మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోనున్నట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. భారతీయ ఉత్పత్తులపై 25 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేసిన నేపథ్యంలో.. ఇవాళ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ లోక్‌సభలో ఆ అంశంపై మాట్లాడారు. సుమోటో స్టేట్మెంట్ ఇచ్చిన ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల వల్ల కలిగే పరిణామాలను స్టడీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కొత్త పన్ను విధానం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ వెల్లడించిన విషయం తెలిసిందే. భారత్‌ది డెడ్ ఎకానమీ అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు ఆయన చెప్పారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తీర్పు

## స్వాగతించిన తెలంగాణ బిజెపి



**హైదరాబాద్ -ప్రజా స్వేచ్ఛ**

పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బిజెపి స్వాగతించింది. ఈ తీర్పను తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు- చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమన్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీ-లు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటు-ందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

# దేశంలోని 10 రాష్ట్రాల్లో 41 బర్డ్ ఫ్లూ కేసులు..

## రాజ్యసభకు కేంద్రం లిఖితపూర్వక సమాధానం



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

ఈ ఏడాది ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 41 బర్డ్ ఫ్లూ కేసులు నమోదయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపింది. బుధవారం రాజ్యసభ కు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖల మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్ పేర్కొన్నారు. అయితే ఈ ఇన్‌ఫెక్షన్‌లు పక్షి జాతికి చెందని పులి, సింహం, చిరుత, దేశవాళీ పిల్లుల్లో కూడా కనిపించాయని మంత్రి తెలిపారు. అంటే మానవుల్లో కూడా బర్డ్ ఫ్లూ రిస్క్ పెరిగే ప్రమాదం ఉందనడానికి ఇది సంకేతమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 24 నాటికి భారత్‌లో మొత్తం 41 బర్డ్ ఫ్లూ కేసులు వెలుగుచూశాయని, గడిచిన ఐదేళ్లలో నమోదైన కేసులతో పోల్చుకుంటే ఈ సంఖ్య తక్కువేనని తెలియజేశారు. 2024లో జూలై 24 నాటికి 49 కేసులు నమోదయ్యాయని, 2021లో అత్యధికంగా 118 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. అతి తక్కువగా 2023లో 15 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు మహారాష్ట్ర, ఛత్తీసగఢ్, జార?ండ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ కేసులు నమోదయ్యాయని మంత్రి తన రిటన్ రిప్లేలో పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ నియంత్రణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు.

# విమానం గాల్లో ఉండగా భారీ కుదుపులు..

## 25 మంది ప్రయాణికులకు గాయాలు



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

అహ్మదాబాద్ విమాన ప్రమాదం అనంతరం ప్రపంచ వ్యాప్తంగా విమానాల్లో తలెత్తుతున్న సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం గగనతలంలో భారీ కుదుపులకు గురైంది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన DL 56 విమానం బుధవారం సాల్ట్ లేక్ సిటీ నుంచి ఆమ్‌స్టర్‌డామ్ కు బయల్దేరింది. ఈ క్రమంలో వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. ఈ ఘటనలో దాదాపు 25 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఇక పైలట్ విమానాన్ని మినియాపొలిస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అనంతరం గాయపడిన ప్రయాణికులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో విమానంలో 275 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనపై డెల్టా ఎయిర్‌లైన్స్ స్పందించింది. కుదుపులకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# భారీ భూకంపం తర్వాత.. రష్యాలో బద్ధలైన క్లూచెవ్‌స్కోయ్ అగ్నిపర్వతం

**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

రష్యాను భారీ భూకంపం వణికించిన విషయం తెలిసిందే. రష్యాకు తూర్పు ప్రాంతంలో బుధవారం ఉదయం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. దీంతో పసిఫిక్ మహాసముద్రంలోని దాదాపు అన్ని దేశాలకు సునామీ ముప్పు ఏర్పడింది. రష్యాతోపాటు జపాన్, అమెరికాలోని పలు తీర ప్రాంతాలను సునామీ అతలాకుతలం చేసింది. ఇక ఈ భారీ భూకంపం తర్వాత రష్యాలోని కమ్‌చట్కా ద్వీపకల్పం లోని క్లూచెవ్‌స్కోయ్ అగ్నిపర్వత విస్ఫోటనం చెందింది. భూకంపం తర్వాత అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడం ప్రారంభించిందని అక్కడి భౌగోళిక శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ అగ్నిపర్వతం నుంచి పెద్ద ఎత్తున లావా ఎగసిపడుతున్నట్లు వెల్లడించారు. పెట్రోపావ్లోవ్స్క్-కమ్‌చట్స్కీకి ఉత్తరాన 450 కి.మీ (280 మైళ్ళు) దూరంలో ఉన్న క్లూచెవ్‌స్కోయ్ అగ్నిపర్వతం ప్రపంచంలోని ఎత్తైన అగ్నిపర్వతాల్లో ఒకటి. ఇది ఇటీవలే కాలంలో చాలాసార్లు విస్ఫోటనం చెందింది. ఇప్పుడు భారీ భూకంపంతో ఈ అగ్నిపర్వతం బద్ధలైనట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. రష్యా కు తూర్పున ఉన్న



కామ్‌చట్కా ద్వీపకల్పంలో 8.8 తీవ్రతతో భూకంపం సంభవించినట్టు జపాన్ వాతావరణశాఖ వెల్లడించింది. రష్యాలో ఇంత తీవ్రతతో భూకంపం రావడం ఇదే మొదటిసారి. భూకంపం కారణంగా వచ్చిన సునామీ ప్రభావంతో కామ్‌చట్కా ఉపఖండంలోని నౌకాశ్రయాలతోపాటు జపాన్ తీరం, అమెరికాలోని హవాయి రాష్ట్ర తీరప్రాంతాలు సముద్రపు నీటిలో మునిగిపోయాయి. మూడు మీటర్ల కన్నా ఎత్తయిన అలలు వరుసగా దాడి చేశాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తీర ప్రాంత ప్రజలు ఎత్తయిన ప్రదేశాలవైపు పరుగులు తీయడంతో అనేక దేశాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. భూకంపం, సునామీ కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్టు ఎటువంటి సమాచారం వెలువడలేదు.

# రేపటినుంచి ఉపాధ్యాయ పదోన్నతులు


**6న స్కూల్ అసిస్టెంట్ల వెబ్ఆప్షన్ల నమోదు**
**7న జీహెచ్ఎం ప్రమోషన్ల ఉత్తర్వులు**
**10 రోజుల్లో ప్రక్రియ పూర్తి**
**షెడ్యూల్ విడుదల**



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
రాష్ట్రంలో శనివారం నుంచి ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పది రోజుల్లో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈనెల ఒకటో తేదీ నాటికి ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుని గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) గ్రేడ్-2, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు పదోన్నతుల ప్రక్రియను చేపడతామని వివరించారు. శనివారం జీహెచ్ఎం, ఎస్ఏ పోస్టుల ఖాళీల వివరాలతోపాటు ఎస్ఏ, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)ల సీనియార్టీ జాబితాను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈనెల మూడు, నాలుగు తేదీల్లో సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాలను పరిశీలించి స్కూల్ అసిస్టెంట్ తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని వివరించారు. ఈనెల ఆరున జీహెచ్ఎం గ్రేడ్-2 పోస్టులకు పదోన్నతుల కోసం అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు వెబ్ఆప్షన్లను నమోదు చేయాలని కోరారు. అదేనెల ఏడో తేదీన ఆర్జేడీలు జీహెచ్ఎం పదోన్నతుల ఉత్తర్వులను విడుదల చేస్తారని తెలిపారు. ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన క్యాడర్ పోస్టుల ఖాళీలను ప్రకటిస్తామని వివరించారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఎస్జీటీల సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామనీ, వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఎస్జీటీల తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈనెల పదో తేదీన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం ఎస్జీటీలు వెబ్ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. అదేనెల 11న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను కల్పిస్తూ డీఈవోలు ఉత్తర్వులను జారీ చేస్తారని వివరించారు.

**3,580 ఉపాధ్యాయులకు పదోన్నతులు!**

రాష్ట్రంలో 3,580 మంది ఉపాధ్యాయులకు




పదోన్నతులు లభించే అవకాశమున్నది. రాష్ట్రంలో 900 జీహెచ్ఎం గ్రేడ్-2 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిసింది. జీహెచ్ఎం పోస్టులను వందశాతం పదోన్నతుల ద్వారానే భర్తీ చేస్తారు. దీంతో 900 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్ఎం పదోన్నతులు లభిస్తాయి. దీంతో 900 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ అవుతాయి. అందులో 70 శాతం పోస్టులు పదోన్నతుల ద్వారా, మిగిలిన 30 శాతం పోస్టులను నేరుగా భర్తీ చేయాల్సి ఉంటుంది. దీంతో 900 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం అంటే 630 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ అవుతాయి. మిగిలిన 30 శాతం అంటే 270 పోస్టులను నేరుగా భర్తీ చేస్తారు. రాష్ట్రంలో రెండు వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులోనూ 70 శాతం పోస్టులే పదోన్నతుల ద్వారా భర్తీ అవుతాయి. అంటే 1,400 మంది ఎస్జీటీలకే పదోన్నతుల వస్తాయి. మిగిలిన 30 శాతం పోస్టులు అంటే 600 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నేరుగా భర్తీ చేస్తారు. ఈ లెక్కన 2,030 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎస్జీటీలకు పదోన్నతులు లభిస్తాయి. రాష్ట్రంలో 650 వరకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని వంద శాతం ఎస్జీటీల ద్వారా భర్తీ చేస్తారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పదోన్నతి పొందాలంటే ఇంటర్, డీఎడ్ చదివిన ఉపాధ్యాయులే అర్హులు. బీఈడీ పూర్తి చేసిన వారికి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పదోన్నతి పొందే అవకాశం లేదు.

**ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీల భర్తీ ఎట్లా?**

రాష్ట్రంలో జీహెచ్ఎం ఖాళీలను స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులను కల్పించి భర్తీ చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను ఎస్జీటీలకు పదోన్నతులను కల్పిస్తున్నారు. దీంతో ఉన్నత పాఠశాలల్లో జీహెచ్ఎంతోపాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ అవుతున్నాయి. దీంతో విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఉంటున్నది. కానీ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు వస్తున్నాయి. ఎస్జీటీల ఖాళీలు మాత్రం భర్తీ కావడం లేదు. స్పౌజ్, పరస్పర బదిలీల వల్ల కొన్ని ఎస్జీటీల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు 2,680 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలకు పదోన్నతులు లభిస్తాయి. దీంతో 2,680 ఎస్జీటీ పోస్టులు ఖాళీలు ఏర్పడబోతున్నాయి. ఉపాధ్యాయ ఖాళీలతో ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుంటే వారిద్దరూ పదోన్నతులు పొందితే ఆ బడి పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతున్నది. అయితే ఉపాధ్యాయుల సర్దుబాటు ద్వారా విద్యార్థులకు న్యాయం చేస్తామని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు

## జనహిత పాదయాత్రలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నేతలు...



జూబ్లీహిల్స్,ప్రజా స్వేచ్ఛ
కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జనహిత పాదయాత్ర పరిగి లో గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ నటరాజన్ తదితరులు హాజరైన ఈ జనహిత కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు చురుకుగా పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కు అతి త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ జనహిత యాత్రలో హైదరాబాద్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నేత, హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి జనహిత పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిసిసి నేతలు, మంత్రులు, ప్రభుత్వ సలహాదారు, ముఖ్యమంత్రి సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డి అందరితో కలివిడిగా తిరుగుతూ పాదయాత్రలో ఉపేందర్ రెడ్డి చురుకుగా పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రిని కలిసిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



అచ్చంపేట,ప్రజా స్వేచ్ఛ
అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గురువారం ఉదయం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తన పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.

## బాల సదన్, శిశుగృహాలు సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి




కరీంనగర్,ప్రజా స్వేచ్ఛ
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేష్ ఆధ్వర్యంలో బాల సదన్, శిశు గృహాలను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ కష్టపడి చదివి ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలని ప్రోత్సహించారు. వంటగదులు, ఆహార నిల్వ గదులు, పిల్లల ఆరోగ్య పరిస్థితులపై పరిశీలన జరిపారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. అధికారుల గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేసి, న్యాయ సేవ అవసరమైతే సంప్రదించాలని సూచించారు.

## పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం



కరీంనగర్,ప్రజా స్వేచ్ఛ
అడిషనల్ ఎస్పీ గౌస్ బాబా మహమ్మద్, ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ మునీందర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సన్మాన మహోత్సవం జరిగింది. టీఎన్జీవో, టీజీ ఓ నేతలు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "వీరి 35 ఏళ్ల సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయి. పోలీస్ అధికారులు సమాజ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు" అన్నారు. కార్యక్రమంలో పోలీస్, ఇంటెలిజెన్స్ అధికారులు, ఉద్యోగులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## జనహిత పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్



పరిగి,ప్రజా స్వేచ్ఛ
పరిగి నియోజకవర్గంలో ప్రారంభమైన జనహిత పాదయాత్రలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏఐసీసీ ఇంచార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ప్రారంభించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎంపీలు, టీపీసీసీ సభ్యులు, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. "జనహిత పాదయాత్ర కార్యకర్తల్లో మనోధైర్యం నింపుతోంది. ప్రతి గ్రామం నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీపీసీసీ ముందుంటోంది," అని శ్రీశైలం గౌడ్ అన్నారు.

## జనహిత పాదయాత్రలో పాల్గొన్న పాండురంగారెడ్డి

-మహేశ్వరం నియోజకవర్గంలో నుండి పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొనడం జరిగింది



రంగారెడ్డి,ప్రజా స్వేచ్ఛ
టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్రలో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వికారాబాద్ జిల్లా పరగి నియోజకవర్గంలో ప్రారంభించిన జనహిత పాదయాత్ర లో మాజీ చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్ రెడ్డి,మాజీ శాసనసభ్యుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తో పాటు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డితో పాటు సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, సభావట్ గణేష్ నాయక్,కంబాల పల్లి మదన్ పాల్ రెడ్డి, వుండల బాబూరావు, ఎగ్గిడి కృష్ణ మహేందర్ తదితరాలు పాల్గొన్నారు.


# జోరందుకుంటున్న వరి నాట్లు

నల్లబెల్లి, ప్రజా స్వేచ్ఛ
గత కొన్ని రోజులుగా వర్షాలు సమృద్ధిగా కోరుతున్నాంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి మండలంలోని రుద్ర గూడెం పరిధి గుంటూరు మాటు మతడి దుంకుతుంది రంగయ్య చెరువు వెంకట పాలెం చెరువులోకి వరద నీరు చేరుకుంది అలాగే మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి మండలంలోని 29 జీపీల పరిధిలో పదివేల ఎకరాలలో వరి సాగుకు రైతుల సిద్ధమయ్యారు అలాగే 9500 ఎకరాల్లో పత్తి 3వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు ఇప్పటికే సాగుచేసిన పంటలకు వర్షం జీవం పోసింది వరి దుక్కులు సిద్ధం చేసుకున్న



అన్నదాతలకు ఊరట పొందుతున్నారు చెరువులు కుంటలు వాగులు, వంకలు జలకల సంతరించుకున్నాయి వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో వరి నాట్లు ఊపందుకున్నాయి వరి నారులు ఎండిపోతున్న తరుణంలో గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండడంతో రైతులు ఉత్సాహంతో వరినాట్లను ప్రారంభించారు పల్లె ప్రాంతాలలో మహిళలు పాటలు పాడుకుంటూ వరి నాట్లు వేస్తుండడం ప్రత్యేక ఆకర్షణగా మారింది మండలంలోని అతిపెద్ద చెరువు అయిన రంగయ్య చెరువు జల కళతో కలకలలాడుతుంది చెరువులోకి 12 ఫీట్ల వరకు నీరు ఉన్నట్లు స్థానికులు తెలియజేశారు మండలంలో రెండో పెద్ద చేరువైన వెంకటపాలెం చెరువు మత్తడి పోస్తుంది మొత్తంగా వరుడు కరుణించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎంపీ నిధుల కోసం వినతి పత్రం అందించిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం



**మెట్ పల్లి -ప్రజా స్వేచ్ఛ**

మెట్ పల్లి నాయి బ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షులు ముత్యాల రమేష్ ఆధ్వర్యంలో ఎంపీ ఫండ్స్ నిమిత్తం రాష్ట్ర బిజెపి నాయకులు డాక్టర్ చిట్నేని రఘు అన్న ను కలిసి వారి ద్వారా పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ అన్న కు వినతి పత్రం అందజేయడం జరిగింది. మా సంఘం అభివృద్ధి కోసం ఎంపీ నిధుల నుండి 10 లక్షల రూపాయలు మంజూరు చేయించగలరని ఇట్టి వినతిపత్రం ద్వారా వారు తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ,నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ముత్యాల రమేష్ , ఉపాధ్యక్షులు నడికుడ పెద్ద సాయన్న , ప్రధాన కార్యదర్శి వెల్లుల్ల సతీష్ , కోషాధికారి చిట్యాల సత్యనారాయణ, కొదురుపాక ముత్తయ్య , సమ్మెట గంగాధర్, కథలపురం గోపి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా సిఎంఆర్ఎఫ్

**2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**




**పటాన్ చేరు- -ప్రజా స్వేచ్ఛ**

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారురామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీకి చెందిన బిక్షపతి గత కొంతకాలంగా అనారోగ్యంలో బాధపడుతున్నారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి మంజూరు అయింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్ఓసి అనుమతి పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు.

## తెలంగాణ కాంగ్రెస్ పాదయాత్ర

**సన్నాహక సమావేశం, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్ ల పంపిణీ**



**శేరిలింగంపల్లి ప్రతినిధి -ప్రజా స్వేచ్ఛ**

పరిగి నియోజకవర్గం నుండి ప్రారంభమయ్యే "తెలంగాణలో నూతన మేల్కొలుపు – కాంగ్రెస్ పాదయాత్ర" ప్రారంభానికి సంబంధించి టీ పి సి సి రాష్ట్ర ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టి పి సి సి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగే కీలక సన్నాహక సమావేశంలో చురుగ్గా పాల్గొనేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్.ఈ సందర్భంగా, జగదీశ్వర్ గౌడ్ అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో కూడా పాల్గొని, ప్రజాసేవ సంక్షేమం పట్ల నాయకుల నిబద్ధతను పునరుద్ఘాటించారు.

జరగబోయే యాత్రలో చురుగ్గా పాల్గొనడానికి ప్రతి అడుగులో ప్రజలతో నిలబడటానికి. సామాజిక న్యాయం కోసం ఒక పాదయాత్ర. మార్పు కోసం ఒక అడుగు. ప్రజల కోసం ఒక స్వరం ను వినిపిస్తాం అని మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ యలమంచి ఉదయ్ కిరణ్ ఈ సందర్భంగా తెలిపారు.

## నేడు శాలిగౌరారం మండలానికి ఎమ్మెల్యే రాక

**శాలిగౌరారం -ప్రజా స్వేచ్ఛ**

శాలిగౌరారం గ్రామ ప్రజలకు మరియు ప్రజా ప్రతినిధులకు తెలియజేయునది ఏమనగా శాలిగౌరారం మండలంలోని వివిధ గ్రామాల్లో సిసి రోడ్ శంకుస్థాపన చేసి శాలిగౌరారం గ్రామపంచాయతీకి నూతనంగా మంజూరైన రేషన్ కార్డు లను లబ్ధి దారులు, మరియు కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న వారు ఈరోజు అనగా శుక్రవారం తేదీ, 01/08/2025, మధ్యాహ్నం 1 గంటలకు శాలిగౌరారం లో సీఎంఆర్ పంక్షన్ హాల్లో, ఎమ్మెల్యే మందుల సామేలు చేతులమీదుగా కొత్త రేషన్ కార్డు లను లబ్ధిదారులకు అందజేయనున్నారు మరియు వివిధ పట్టణాల్లో గ్రామాల్లో ఉన్న ప్రజలు తప్పకుండా వచ్చి వారి యొక్క రేషన్ కార్డులు చేసుకోగలరని కోరుతున్నాము.

# దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శవంతంగా నిలుస్తుంది

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**ప్రజా స్వేచ్ఛ గోపాల్ పేట /వనపర్తి జిల్లా ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ప్రజల కలలు, ఆశయాలను నెరవేర్చుతారనే నమ్మకంతో గత పాలకులకు ప్రజలు ఓట్లు వేసి అవకాశం ఇస్తే 10 సంవత్సరాల్లో వాళ్లే లబ్ధి పొందారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎమ్మెల్యే టి.మేఘారెడ్డి విమర్శించారు.గోపాల్ పేట మండల కేంద్రం లోని,పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే మాట్లాడుతు,10 సం,,నుండి కొత్త రేషన్ కార్డులు లేక పెళ్లి అయిన వారి పేర్లు, పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో చేర్పించకపోవడంతో లబ్ధిదారులు చాలా నష్టపోవడం జరిగిందని అన్నారు.అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం జరిగింది అన్నారు.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు,రూ,500 కే సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఇందిరమ్మ పథకం.మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5.00 లక్షలు లబ్ధిదారుల



ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు.ఇల్లు లేనివారికి రెండవ దఫా మళ్ళీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ,రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని,ఇంకా ఎవరైనా రేషన్ కార్డు రానివారు ఉంటే ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పేద ప్రజల కొత్త రేషన్ కార్డుల కల ప్రభుత్వం నెరవేర్చిందని,కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న పాత రేషన్ కార్డులలో కొత్తగా వచ్చిన వారి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసి ఆధునీకరించడం జరిగిందని తెలిపారు.కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డు ఉన్నవారికి ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.గోపాల్ పేట,రేవల్లి,ఎదుల మండలాలకు కలిపి 3500 రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు,జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, తాహసిల్దార్లు పాండు, లక్ష్మీ, మల్లికార్జున్,సింగిల్ విండో చైర్మన్ రఘు,మాజీ ఎంపీపీ సత్యశీల రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు,రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల,బాలికల భద్రతకె షి టీమ్స్

**జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**

**ప్రజా స్వేచ్ఛ మెదక్ జిల్లా ప్రతినిధి**

మహిళల,బాలికల భద్రతకే షీ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింద ని ఎవరైనా వేధింపులకు గురైతే నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎవరైనా వేధించినా,రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712657963, పోలీస్ లకు ఫోన్ చేసి పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే ఆ ప్రదేశానికి చేరుకుంటామని మరియు ఫోన్ చేసిన వారి నెంబరు పేర్లు గోప్యంగా ఉంచుతామని మహిళలు మరియు బాలికల రక్షణ గురించి షీటీమ్స్ పని చేయడం జరుగుతుందని, మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే వాట్సప్ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని



మీకు తెలియకుండా పోలీసులు సివిల్ డ్రస్ లలో ముఖ్య కూడళ్లల్లో తిరుగుతున్నారని అలాగే చదువుకునే విద్యార్థినిలకు 18 సంవత్సరాలు నిండకుండానే వివాహము చేస్తున్నట్లుగానే తెలిస్తే వెంటనే 1098 కుతెలియజేయాలని మరియు యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ యూనిట్ను మెదక్ జిల్లాలో ప్రారంభించడం జరిగిందని మనుషుల అక్రమ రవాణా జరిగితే వెంటనే సమాచారం అందించాలని ఆర్గనైజ్డ్ నేరాలు చేసే వారిపై ఫిర్యాదు చేయాలని సూచించారు. మెదక్ షీటీమ్స్ జులై నెలలో ఇప్పటి వరకు నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజర్స్ పట్టుకొని 03 ఎఫ్ ఐ ఆర్ లను, 16 ఈ పెట్టి కేసులను నమోదు చేయడం జరిగిందని, రెడ్ హాండ్ గా తూప్రాన్ సబ్ డివిజన్ లో 39 మందిని, మెదక్ సబ్ డివిజన్ లో 29 మంది మొత్తం 68 మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని చెప్పారు.షీ టీమ్స్ బృందాలు 54 అవగాహన కార్యాక్రమాలను ప్రభుత్వ కళాశాలలో,ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ షీ టీం బృందాలు తూప్రాన్ డి.ఎస్.పి నరేందర్ గౌడ్ మరియు మెదక్ డి.ఎస్.పి ప్రసన్న కుమార్ ల ఆద్వర్యంలో షీటీమ్స్ బృందాలు పని చేయడం జరుగుతుందని,షీటీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు ప్రమీల , విజయ్,స్వరూప,గంగామణి వారి వారి డివిజన్ల వారిగా విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.


# బీఆర్ఎస్‌కు చెంపపెట్టు

**-నిర్ణయాధికారం స్పీకర్‌దేనని సుప్రీం చెప్పింది**
**-కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి**
**-ఫిరాయింపులపై మాట్లాడే అర్హత హరీశ్‌రావు, కేటీఆర్‌కు లేదు:**

**ప్రజా స్వేచ్ఛ-హైదరాబాద్, జులై 31**

తెలంగాణలో ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కన్నారని, వారి కలలన్నీ కల్లలయ్యాయని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రమే నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. స్పీకర్ నిర్ణయం కోసం వేచి చూడాల్సిందేనని చెప్పారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. ఉప ఎన్నికలొస్తే సిద్ధంగా ఉన్నామని, తప్పక గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ నేతలకు చెంపపెట్టు అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతల మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. సీఎల్పీ కార్యాలయంలో మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై హరీశ్, కేటీఆర్‌లకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు
రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

నాయకులు సంబరపడుతున్నారని మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ 2014లో టీడీపీ తరఫున గెలిచి, బీఆర్ఎసలో చేరారని.. అలాంటి వ్యక్తి ఇప్పుడు ఫిరాయింపులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని చెప్పారు.

**అనర్హతపై స్పీకర్‌కు సుప్రీం సూచనే: అద్దంకి**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచన మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. న్యాయస్థానాలు స్పీకర్ అధికారాలను ప్రశ్నించలేవని చెప్పారు. ప్రతిపక్ష నేత హోదా ఉన్నప్పటికీ అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని తాము స్పీకర్‌ను కోరుతున్నట్టు దయాకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. చట్టంలోని లొసుగుల కారణంగా అది సాధ్యమవుతుందా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సందేహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన వారిపై తక్షణమే అనర్హత వేటు పడేలా చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు

# బిజినెస్

## ట్రంప్ సుంకాలు.


### రెండో సెషన్‌లో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోసెషన్‌లో నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 24,800 పాయింట్ల కంటే దిగువన ముగిసింది. సెన్సెక్స్ 296 పాయింట్లకుపైగా పతనమైంది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. ఆగస్టు ఒకటి నుంచి భారత్ నుంచి వచ్చే అన్ని వస్తువులపై 25శాతం సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు, సైనిక ఆయుధాలను కొనుగోలు చేయడంపై ట్రంప్ సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఉదయం మార్కెట్లు నష్టాల్లో మొదలయ్యాయి. ఏ దశలోనూ సూచీలు మళ్లీ కోలుకోలేదు. ఉదయం 80,695.50 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 81,803.27 పాయింట్ల గరిష్టానికి చేరుకొని.. అత్యల్పంగా 80,695.15 పాయింట్లకు పడిపోయింది. చివరకు 296.28 పాయింట్లు నష్టపోయి.. 81,185.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 86.70 పాయింట్లు తగ్గి.. 24,768.35 పాయింట్లు వద్ద కొనసాగుతున్నది. దాదాపు 1,490 షేర్లు లాభపడగా.. 2,365 షేర్లు పతనమయ్యాయి. హెచ్‌యూఎల్, జియో ఫైనాన్షియల్, ఎటర్నల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. అయితే, నష్టపోయిన వాటిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, సన్ ఫార్మా ఉన్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7 శాతం తగ్గాయి. ఎఫ్ఎంసీజీ 1.4శాతం పెరగ్గా.. ఐటీ, మెటల్ 1.4 శాతం పెరగ్గా.. ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, ఫార్మా, రియాల్టీ, టెలికాం 0.5-1.8 శాతం వరకు పతనమయ్యాయి.

## ఆకాశాన్నంటుతున్న ధరలు..

### రెండో త్రైమాసికంలో 3శాతం పెరిగిన బంగారం డిమాండ్..!



ఈ ఏడాది రెండో త్రైమాసికంలో బంగారం డిమాండ్ మూడుశాతం పెరిగి 1,249 టన్నులకు చేరుకుంది. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా డిమాండ్ పెరగడం విశేషం. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం.. వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో బంగారం డిమాండ్‌ను నిలుపుకోవడంతో పెట్టుబడుల ప్రవాహనం కొనసాగడంతో త్రైమాసికంలో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశ బంగారం డిమాండ్ 10 శాతం తగ్గి 134.9 టన్నులకు చేరుకుందని ప్రపంచ బంగారు మండలి గురువారం తెలిపింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది 149.7 టన్నులుగా ఉన్నది. విలువ పరంగా ఈ క్యాలెండర్ సంవత్సరం రెండవ త్రైమాసికంలో బంగారం డిమాండ్ 30 శాతం పెరిగి రూ.1,21,800 కోట్లకు చేరుకుంది. ఇది 2024 ఇదే కాలంలో రూ.93,850 కోట్లుగా నమోదైంది. మరో వైపు బంగారం ధరలు మొదటిసారిగా తులానికి గ్రాములకు రూ.లక్ష మార్క్‌ను అధిగమించింది.వాణిజ్య ఉద్రిక్తతలు, వివిధ దేశాల మధ్య యుద్ధ భయాలు తదితర కారణాలతో ఈ ఏడాది ప్రారంభంలో మార్కెట్లు అస్థిరతను ఎదుర్కొన్నాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ సీనియర్ మార్కెట్ విశ్లేషకుడు లూయిస్ స్ట్రీట్ పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో బంగారం డాలర్ పరంగా 26శాతం లాభాలను నమోదు చేసింది. బంగారం డిమాండ్‌ను పెంచడంలో గోల్డ్ ఈటీఎఫ్‌లు కీలకంగా పని చేశాయి. రెండో త్రైమాసికంలో 170 టన్నుల మేర పెట్టుబడులు వచ్చాయి. 2024 రెండవ త్రైమాసికంలో స్వల్ప అమ్మకాలు నమోదయ్యాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లు 2020 నుంచి తొలి అర్ధభాగంలోనే ఎక్కువగా పెట్టుబడులు చూశాయి. తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో పెట్టుబడుల ప్రవాహం కొనసాగగా.. వరల్డ్ గోల్డ్ ఈటీఎఫ్ డిమాండ్ 397 టన్నులకు చేరుకుంది. మొత్తం బార్ అండ్ కాయిన్ పెట్టుబడులు సంవత్సరానికి 11 శాతం పెరిగి 307 టన్నులకు చేరుకున్నాయని WGC నివేదిక పేర్కొంది. చైనా పెట్టుబడిదారులు 115 టన్నులతో అగ్రస్థానంలో ఉన్నది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 44 శాతం గణనీయమైన పెరుగుదల నమోదైంది. భారతీయ పెట్టుబడిదారులు కొనసాగించారు. మరో వైపు ఆభరణాల డిమాండ్ తగ్గుతూ వస్తున్నది. వినియోగ పరిమాణం 14 శాతం తగ్గి 2020 కొవిడ్ సమయంలో అత్యల్ప స్థాయికి చేరుకున్నది.

## టారిఫ్‌లు నేటి నుండే అమలు

### రాష్ట్రంలోని అక్వా రైతులపై ప్రభావం



భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాలు నేటి (శుక్రవారం) నుంచే అమలులోకి రానున్నాయి. రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నందుకు గానూ 25శాతం అధిక టారిఫ్‌లను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్‌ను అత్యంత సన్నిహిత దేశంగా పేర్కొంటూనే ఆయన అధిక టారిఫ్‌లు విధించడం గమనార్హం ట్రంప్ చర్యలతో ప్రధానంగా భారత ఎగుమతి రంగాలైన ఆటో పరికరాలు, స్టీల్, అల్యూమినియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ, టెక్స్‌టైల్స్, సముద్రపు ఉత్పత్తులపై ప్రధానంగా ప్రభావం పడనుంది. రాష్ట్రంలో రొయ్యల ఎగుమతి అధిక టారిఫ్‌లు తీవ్ర ప్రభావం చూపను న్నాయి. దేశం మొత్తంమీద జరుగుతున్న రొయ్యల ఎగుమతుల్లో 70శాతం రాష్ట్రం నుండే జరగు తోంది. ఈ రంగంపై దాదాపు 10 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అంచనా. అధిక సుంకాల కారణంగా అమెరికాలో భారత రొయ్యల ధరలు భారీగా పెరుగుతాయి. ఇది వినియోగదారులపై ప్రభావం చూపుతుందని, ఎగుమతులు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే విధంగా వ్యవసాయం, ఐటి, తయారీ రంగాలపై అధిక టారిఫ్‌లు ప్రభావం చూపనున్నాయి. మామిడి, మసాలాలు, బియ్యం తదితర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఈ రంగంలోని రైతులు స్థానిక మార్కెట్లపై లేదా ఇతర దేశాల మార్కెట్లపై ఆధారపడవలసి వస్తుంది.

---

## రూ.25కోట్లు ఇవ్వడానికి రెడీగా కేకేఆర్..
## ఆ జట్టు కెప్టెన్‌గా కేఎల్ రాహుల్?



ఇంగ్లండ్‌లో కేఎల్ రాహుల్ బ్యాట్ పరుగుల వర్షం కురిపిస్తోంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే రెండు సెంచరీలు సాధించిన రాహుల్‌పై ఒక సంచలన వార్త బయటికొచ్చింది. ఐపీఎల్ 2026లో కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ బదులు కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడబోతున్నాడట. కేకేఆర్ జట్టు అతన్ని ఎలాగైనా ట్రేడ్ ద్వారా తమ స్క్వాడ్‌లోకి తీసుకోవాలని చూస్తోందని తెలుస్తోంది. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ రాహుల్‌ను రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. అతను 13 ఇన్నింగ్స్‌లలో 539 పరుగులు చేశాడు. ఇప్పుడు ఈ కొత్త వార్త క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఇప్పుడు మంచి కెప్టెన్ అవసరం. గత సీజన్‌లో జట్టుకు అజింక్య రహానే కెప్టెన్‌గా ఉన్నాడు, కానీ టీమ్ ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది, వారి ప్రదర్శన కూడా నిరాశపరిచింది. దీంతో కేకేఆర్ ఇప్పుడు భారీ మార్పులకు సిద్ధంగా ఉంది. అందుకే వారు కేఎల్ రాహుల్‌ను జట్టులోకి తీసుకొచ్చి కెప్టెన్‌గా చేయాలని భావిస్తున్నారు. కేఎల్ రాహుల్ కోసం కేకేఆర్ ఏకంగా రూ. 25 కోట్ల వరకు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందట. కేఎల్ రాహుల్ కేవలం ఒక మంచి బ్యాట్స్‌మెన్ మాత్రమే కాదు, అతను కెప్టెన్, వికెట్ కీపర్ పాత్రలను కూడా సమర్థవంతంగా పోషించగలడు. అందుకే కేకేఆర్ అతని కోసం ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.ఐపీఎల్ 2025 వేలానికి ముందు కేకేఆర్ ఒక పెద్ద తప్పు చేసింది. టీమ్‌కు మూడో ఐపీఎల్ టైటిల్ అందించిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌ను కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. దీని పర్యవసానంగా, అయ్యర్ పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా మారాడు. అయ్యర్ వెళ్లిపోవడంతో కేకేఆర్‌కు పెద్ద నష్టం వాటిల్లింది. మొదట కెప్టెన్ మారాడు, ఆ తర్వాత టీమ్ ఆడే విధానం కూడా మారిపోయింది. గత సీజన్‌లో 14 మ్యాచ్‌లలో కేవలం 5 మ్యాచ్‌లలో మాత్రమే గెలవగలిగింది. ఇప్పుడు ఐపీఎల్ 2026కు ముందు, కేకేఆర్ తమ హెడ్ కోచ్ చంద్రకాంత్ పండిట్‌ను కూడా తొలగించింది. ఒకప్పుడు ఈ జట్టు బౌలింగ్ విభాగాన్ని పటిష్టం చేసిన భరత్ అరుణ్ కూడా లక్నో సూపర్ జెయింట్స్‌కు మారారు. ప్రస్తుతం కేకేఆర్ ఎలాగైనా కేఎల్ రాహుల్‌ను జట్టులోకి తీసుకొచ్చి టీమ్ బ్యాలెన్స్‌ను సెట్ చేసుకోవాలని చూస్తోంది. అయితే, ఢిల్లీ క్యాపిటల్స్ కేఎల్ రాహుల్‌ను రిలీజ్ చేస్తుందా అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.

## క్వార్టర్స్‌కు తరుణ్

### సాత్విక్ జోడీ, లక్ష్యసేన్ ముందంజ



**మకావు**

చైనా వేదికగా జరుగుతున్న మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాదీ యువ షట్లర్ తరుణ్ మన్నేపల్లి సంచలన విజయంతో సత్తాచాటాడు. పురుషుల ప్రిక్వార్టర్స్ పోరులో ప్రపంచ 47వ ర్యాంకర్ తరుణ్.. 19-21, 21-14, 22-20తో తనకంటే మెరుగైన ర్యాంకు (15) కల్గిన టాప్‌సీడ్ లీ చెక్ యి (చైనా)ను చిత్తుచేశాడు. సుమారు గంటకు పైగా హెూరాహెూరీగా జరిగిన పోరులో తరుణ్.. తొలి గేమ్ ఓడినప్పటికీ తర్వాత పుంజుకుని వరుస గేమ్‌లలో ప్రత్యర్థిని చిత్తుచేశాడు. తరుణ్ కెరీర్‌లో సూపర్ 300 టోర్నీలో క్వార్టర్స్ చేరడం ఇది రెండోసారి. నిరుడు అతడు జర్మన్ ఓపెన్‌లో క్వార్టర్స్ చేరాడు.క్వార్టర్స్‌లో అతడు.. ప్రపంచ 87వ ర్యాంకర్ హు జె అన్ (చైనా)ను ఢీకొననున్నాడు. మరో సింగిల్స్ మ్యాచ్‌లో భారత నెంబర్ వన్ షట్లర్ లక్ష్యసేన్.. 21-14, 14-21, 21-17తో చికో వర్డొయొ (ఇండోనేషియా)ను ఓడించి క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్‌లో భారత జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి.. 10-21, 22-20, 21-16తో కుమగై-నిషి (జపాన్)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. సింగిల్స్‌లో అయూశ్ శెట్టి పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. మహిళల సింగిల్స్‌లో రక్షిత రామ్‌రాజ్.. 21-14, 10-21, 11-21తో ఆంగ్‌బమ్రుంగ్ఫన్ (బుసానన్) చేతిలో ఓడింది.

# స్పోర్ట్స్

## గిల్ అరుదైన ఘనత..
## 743 రన్స్ చేసిన భారత సారథి

కెప్టెన్‌గా తొలి టెస్టు సిరీస్‌లోనే దిగ్గజాల సరసన
బ్యాటింగ్‌లో తడబడ్డ భారత్
తొలి ఇన్నింగ్స్‌లో 204/6
ఆదుకున్న కరుణ్
రాణించిన ఇంగ్లిష్ పేసర్లు



**ఓవల్**

ఇంగ్లండ్‌తో సిరీస్‌ను 2-2తో సమం చేయాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ తడబాటుకు గురైంది. టాస్ గెలిచి పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకున్న ఇంగ్లండ్ పేసర్లు కట్టడిచేయడంతో టీమ్‌ఇండియా ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. పలుమార్లు వర్షం అంతరాయం కల్గించిన మ్యాచ్‌లో 64 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (98 బంతుల్లో 52 నాటౌట్, 7 ఫోర్లు) అర్ధ శతకంతో రాణించగా సాయి సుదర్శన్ (108 బంతుల్లో 38, 6 ఫోర్లు) భారత్‌ను ఆదుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ (2/31) జోష్ టంగ్ (2/47) తలా రెండు వికెట్లు తీయగా వోక్స్ ఒక వికెట్ తీశాడు.

**గిల్ అరుదైన ఘనత**

కెప్టెన్‌గా తన తొలి టెస్టు సిరీస్‌లోనే గిల్ దిగ్గజాల సరసన నిలిచాడు. ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా ఉన్న భారత సారథి (743).. ఐదో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత సారథిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు సునీల్ గవాస్కర్ (1978/79లో వెస్టిండీస్‌తో 732 రన్స్) పేరిట ఉండేది. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (2016/17లో ఇంగ్లండ్ పై 655) మూడో స్థానంలో ఉన్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 64 ఓవర్లలో 204/6 (కరుణ్ 52బి, సాయి 38, అట్కిన్సన్ 2/31, టంగ్ 2/47)

# దొరికేసిందిరోయ్.. కుర్రాళ్లకు మరో నేషనల్ క్రష్..

## కింగ్‌డమ్ బ్యూటీ అదిరిపోయింది..



విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటేస్ట్ మూవీ కింగ్డమ్. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. జూలై 31న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అడియన్స్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే.భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు కుర్రాళ్ల కొత్త నేషనల్ క్రష్. గతేడాది మాస్ మహరాజా రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. భారీ అంచనాలు మధ్య విడుదలైన ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. కానీ అందరి దృష్టిని ఆకర్షించింది ఈ అమ్మడు.తొలి చిత్రంలోనే గ్లామర్ షోతోపాటు అభినయంతో కట్టిపడేసింది ఈ వయ్యారి. కానీ ఫస్ట్ మూవీ డిజాస్టర్ కావడంతో ఆమెకు పెద్దగా హెల్ప్ కాలేదు. అయితే తెలుగులో నెమ్మదిగా ఆఫర్స్ మాత్రం అందుకుంది. ప్రస్తుతం చేతిలో నాలుగైదు సినిమాలతో బిజీగా ఉంది.మిస్టర్ బచ్చన్ తర్వాత ఈ అమ్మడు నటించిన కింగ్డమ్ సినిమా విడుదలైంది. జూలై 31న అడియన్స్ ముందుకు వచ్చిన ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. అంతేకాదు..ఈ మూవీ ప్రమోషన్లలో గ్లామర్ లుక్స్ లో కట్టిపడేసింది భాగ్యశ్రీ. దీంతో ఈ అమ్మడు ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి.కొత్త నేషనల్ క్రష్ అదిరిపోయిందంటూ భాగ్యశ్రీ ఫోటోస్ షేర్ చేస్తున్నారు ఫ్యాన్స్. ప్రస్తుతం రామ్ పోతినేని సరసన నటిస్తుంది. అలాగే దుల్కర్ సల్మాన పక్కన కాంత అనే చిత్రంలో నటిస్తుంది.





# నేను బోల్డ్‌గా ఉండడం పట్ల మహిళలే విమర్శిస్తున్నారు..

## నా భర్త, పిల్లలు ఏనాడు నన్ను జడ్జ్ చేయరు

నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సినిమాలు, షోస్‌తోనే కాకుండా వివాదాలతోను వార్తలలో నిలుస్తూ ఉంటుందనే విషయం తెలిసిందే. బుల్లితెరపై యాంకర్‌గా, వెండితెరపై నటిగా ఆమెకు విశేషమైన గుర్తింపు ఉంది. అంతేకాదు, గ్లామర్ పరంగా కూడా అనసూయకి ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉంది. సోషల్ మీడియా వేదికగా ఆమెపై జరిగే చర్చలు రోజూ ఏదో ఒకదాంట్లో హాట్ టాపిక్ అవుతుంటాయి. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన రంగస్థలం చిత్రంలో అనసూయ చేసిన "రంగమ్మత్త" పాత్ర ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఈ పాత్ర కోసం తొలుత సీనియర్ నటి రాశికి అవకాశం ఇచ్చినప్పటికీ, ఆమె తిరస్కరించడంతో అనసూయకి ఆ ఛాన్స్ దక్కింది. ఈ పాత్ర ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా మారింది.అయితే అనసూయపై సోషల్ మీడియాలో, యూట్యూబ్ చానళ్లలో విమర్శలు వెల్లువెత్తుంటాయి. ముఖ్యంగా ఆమె డ్రెస్సింగ్ స్టైల్ గురించి విమర్శలు ఎక్కువయ్యాయి. దీని గురించి మాట్లాడిన అనేసూయ.. "కొంతమంది మహిళలే నన్ను టార్గెట్ చేస్తున్నారు. వాళ్లతో నాకు ఎలాంటి వ్యక్తిగత పరిచయం లేదు, అయినా నా వ్యక్తిత్వంపై విమర్శలు చేస్తున్నారు" అని తెలిపారు. నేను తల్లి, భార్య, అయినా నా స్టైల్‌కి తగినట్టు బట్టలు ధరిస్తాను. అందం, స్టైల్, కాన్ఫిడెన్స్ ఇవన్నీ నా వ్యక్తిత్వం లో భాగమే. తల్లిగా ఉండడం అంటే జీవితం లో మిగతావన్నీ వదిలేయాలన్న భావనను నేను ఒప్పుకోను అని ధైర్యంగా స్పందించారు.నా భర్త, నా పిల్లలు నన్ను పూర్తిగా అర్థం చేసుకుంటారు. నన్ను ప్రేమిస్తారు, సపోర్ట్ చేస్తారు. వారు ఎప్పుడూ నన్ను జడ్జ్ చేయలేదు. నేను ఎవరికీ నా విధానం మీద బలవంతం చేయను. నా లైఫ్ ఎలా కావాలో అలా బ్రతకడానికే నాకు హక్కు ఉంది. అదే హక్కు మిగిలిన అందరికీ కూడా ఉంది అని అనసూయ స్పష్టం చేశారు. సమాజం నుంచి వచ్చే విమర్శల మధ్య వ్యక్తిగత ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టుకోవడం చాలా కష్టం. కాని అనసూయ మాత్రం అనేక ఛాలెంజెస్ స్వీకరిస్తూ ముందుకు సాగుతుంది.

# ఐరెన్ లెగ్ నేను కాదు అతనే..

## షాకింగ్ కామెంట్స్ చేసిన శ్రుతిహాసన్


అందాల భామ శ్రుతిహాసన్ ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాలతో దూసుకుపోతుంది. లోకనాయకుడు కమల్ హాసన్ కూతురైన శ్రుతిహాసన్ కెరీర్ బిగినింగ్ లో ఒకటి రెండు సినిమాల్లో పాటలు పాడింది. ఆ తర్వాత హీరోయిన్ గా మారి సినిమాలు చేస్తూ రాణిస్తుంది. అనగనగా ఓ ధీరుడు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. అయితే కెరీర్ బిగినింగ్ లో వరుసగా ఫ్లాప్స్ అందుకుంది. ఎప్పుడైతే పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తో కలిసి ఓ సినిమా చేసిందో ఈ ముద్దుగుమ్మ జాతకమే మారిపోయింది. ఆ తర్వాత ఈ బ్యూటీ నటించిన సినిమాలన్నీ హిట్ అయ్యాయి. మధ్యలో లవ్, డేటింగ్, రిలేషన్ షిప్ అంటూ కాస్త గ్యాప్ తీసుకున్నా రీ ఎంట్రీలో దుమ్ము దులుపుతోంది. సెకెండ్ ఇన్నింగ్స్ లో చేసిన సినిమాలన్నీ సూపర్ హిట్స్ గా నిలిచాయి.శ్రుతిహాసన్ రీసెంట్ డేస్ లో పాన్ ఇండియా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. ఇటీవలే వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య సినిమాలతో పాటు ప్రభాస్ నటించిన పాన్ ఇండియా మూవీ సలార్ మూవీతో హిట్స్ అందుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. లోకేశ్ కనగరాజ్– రజనీ కాంత్ కాంబోలో వస్తోన్న కూలీ సినిమాలో శ్రుతి హాసన్ నటిస్తోంది. అలాగే విజయ్ సేతుపతి ట్రైన్ మూవీలోనూ హీరోయిన్ గా ఎంపికైంది. ఇక సలార్ పార్ట్ 2లోనూ ఆమె నటించాల్సి ఉంది. దీంతో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులు శ్రుతి చేతిలో ఉన్నాయి.తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రుతిహాసన్ మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. శ్రుతి కెరీర్ బిగినింగ్ లో వరుస ఫ్లాప్స్ అందుకుంది.. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. అయితే ఫ్లాప్స్ అందుకున్న సమయంలో శ్రుతిని ఐరన్ లెగ్ అని కొంతమంది ట్రోల్ చేశారు. దీని పై శ్రుతి మాట్లాడుతూ.. కెరీర్ స్టార్టింగ్ లో సిద్దార్థ్ తో వరుసగా సినిమాలు చేశా.. ఆ సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. దాంతో మీరు అర్థం చేసుకోవచ్చు ఐరెన్ లెగ్ ఎవరో అని చెప్పుకొచ్చింది. సినిమా కోసం అందరం కలిసి పని చేస్తాం.. ఎంతో కష్టపడి పని చేస్తాం.. కానీ అది మన చేతిలో ఉండదు అంటూ శ్రుతి హాసన్ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.





# 'సైయారా' సంచలనం.. 13 రోజుల్లో 'ఛావా' రికార్డు బద్దలు!

బాలీవుడ్‌తో పాటు ప్రస్తుతం ఇండియా అంతటా వినిపిస్తున్న పేరు సైయారా . చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం ఇండియాతో పాటు వరల్డ్ వైడ్‌గా సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రం రూ. 400 కోట్ల వసూళ్లను రాబట్టి విజయవంతంగా దూసుకెళుతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం మరో రికార్డును అందుకుంది. ఓవర్సీస్‌లో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సొంతం చేసుకున్న బాలీవుడ్ సినిమాగా రికార్డు నెలకొల్పిన 'ఛావా' సినిమా రికార్డును బీట్ చేసింది సైయారా. ఛావా సినిమా వరల్డ్ వైడ్‌గా రూ.91 కోట్లు వసూళ్లను రాబట్టి.. ఈ ఏడాది టాప్‌లో ఉండగా.. కేవలం 13 రోజుల్లోనే ఈ రికార్డును అధిగమించి రూ.94 కోట్లతో దూసుకుపోతుంది సైయారా. ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయిన్‌లుగా నటించారు.



# 'ఊపిరి ఊయలగా'.. 'వార్2' నుంచి రొమాంటిక్ సాంగ్ రిలీజ్

అగ్ర కథానాయకులు హృతిక్ రోషన్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం వార్ 2 (వార్ 2). యష్‌రాజ్ బ్యానర్‌పై అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తుంది. స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం ఇండిపెండెన్స్ డే కానుకగా ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూవీ నుంచి వరుస అప్‌డేట్స్ ఇస్తున్నారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా 'ఊపిరి ఊయలగా' అంటూ సాగే రొమాంటిక్ సాంగ్‌ని వదిలింది. హృతిక్, కియారాల మధ్య వచ్చే ఈ సాంగ్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది. తెలుగు పాటకు చంద్రబోస్ లిరిక్స్ అందించగా.. శశ్వాంత్ సింగ్ పాడారు.




Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492